క్లుప్తంగా

పోటీ పరీక్షలపై అవగాహన



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రం లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కఠినమైన శ్రమ అవసరం అని, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. నాగేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ అందజేత



గండేడ్: శిక్షణ ఫౌండేషన్ తరపున గండేడ్ ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. మండల కోఆర్డినేటర్ అశోక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మోటార్లు కాలిపోతున్నాయి

గండేడ్: గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో లోపాల వల్ల మోటార్లు కాలిపోతున్నాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం గండేడ్‌లో విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ వస్తూ పోతూ ఉండడంతో సమస్య తలెత్తుతోందన్నారు. అధికారులు స్పందించి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

కిరణ్‌కు ఘననివాళి



చిన్నచింతకుంట: ఉంద్యాలలో ఐఎఫ్‌టీయూ నాయకుడు కిరణ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీఎస్ దేవదానం తదితరులు కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆటో యూనియన్ నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

భూత్పూర్: అన్నాసాగర్‌కి చెందిన బోయ మల్కన్నను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మల్కన్న అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆల ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

కో ఇన్‌చార్జ్‌గా పీర్ మహ్మద్ సాధిక్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాబోయే ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ మైనార్టీ విభాగం మహబూబ్‌నగర్ పార్లమెంట్ కోఇన్‌చార్జ్‌గా జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు పీర్ మహ్మద్ సాధిక్ నియమించారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జ్ ఫర్హాన్ అజ్మి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పీర్ సాధిక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ

బాలానగర్: ఎండలు మండుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పనిచేసే కూలీల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈజీఎస్ పనుల్లో పనిచేసే కూలీల కోసం వాటర్ క్యాన్‌లు, టెంట్‌లు, ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ వంటి చర్యలు చేపడుతున్నారు. శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ దీప్లానాయక్, మేటి కేశవులు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జడ్చర్ల: స్థానిక 14వ వార్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. వేసవి కాలంలో బాటసారులకు చలివేంద్రాల ద్వార తాగు నీటిని అందించడం అభినందనీయమని ఆయన నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్ పుష్పలత, నాయకులు పరమటయ్య, సత్యం, శ్రీను, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ ఏర్పాటు

జడ్చర్ల: పట్టణంలో శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పెరుమాళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. అంతకుముందు మసీదులో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, మోయూజ్, తదితరులు పాల్గొన్నారు.






బస్సుల్లేక అవస్థలు

జిల్లా కేంద్రంలో శనివారం గంటల తరబడి బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికుల అవస్థలకు నిదర్శనం ఈ చిత్రాలు. రంజాన్, ఉగాది పండుగలు, పరీక్షల వాయిదా తదితర కారణాలతో ప్రజలు పెద్దఎత్తున గ్రామాలకు తరలుతున్నారు. ఇప్పటికే బస్సులు సరిపడా లేవని.. దీనికి తోడు జన జాతర సభ నేపథ్యంలో బస్సులు హైదరాబాద్ బాట పట్టడంతో కష్టాలు రెట్టింపయ్యాయని పలువురు వాపోయారు. వచ్చిన ఒకటి, రెండు బస్సులు ఎక్కేందుకు పోటీపడ్డారు.

– సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

నీరందించే బాధ్యత మీదే

- ఎక్కడా ఫిర్యాదులు రావొద్దు
- అప్రమత్తంగా వ్యవహరించండి
- అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రసాద్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రసాద్

గండేడ్: వేసవిలో గ్రామాల్లో ఎక్కడా సమస్య రాకూడదని.. వచ్చిదంటే గ్రిడ్, ఇంట్రా వాళ్లదే బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రసాద్ పేర్కొన్నారు. నీరు అందించడం కోసం వనరులన్నీ వినియోగించుకోవాలన్నారు.

శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో గండేడ్, మహమ్మదాబాద్ మండలాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో నీటి సమస్యపై రివ్యూ నిర్వహించారు. గ్రామాల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో ఎన్ని బోర్లు ఉన్నాయి? వాటిలో అందుబాటులో ఉన్నవి ఎన్ని అంటూ ఆరాతీశారు. అదేవిధంగా మిషన్ భగీరథ నీటి సరఫరాపై తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నీటి సమస్య రాకూడదన్నారు. స్థానిక వనరులు అన్ని వినియోగించి ప్రజలకు నీరందేలా చూడాలన్నారు. అక్కడ మిషన్ భగీరథగానీ, బోర్లుగానీ లేకుంటే ట్యాంకర్ల ద్వారానైనా నీటి సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ బోర్ల నుంచి కూడా నీటిని తీసుకుని సరఫరా చేయాలన్నారు. లీకేజీలు, మోటర్ల రిపేర్లు ఏమున్నా తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు చాలక పోతే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆయన నిధుల నుంచి అయినా కొత్త బోర్లు వేసి సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. ఇంత జరిగినా సమస్య వచ్చిందంటే అందుకు ఏఈలే బాధ్యులవుతారని అన్నారు. ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులదే అన్నారు. ఎక్కడా ఫిర్యాదులు రావొద్దన్నారు. కాగా గ్రిడ్ అధికారులు ఎవరు కూడా సమావేశానికి రాక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీఓ వెంకటేశ్వర్లు, ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి, గండేడ్, మహమ్మదాబాద్ మండలాల స్పెషల్ ఆఫీసర్లు పాండు, ఛత్రునాయక్, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ శంకర్‌నాయక్ , ఏఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

మహమ్మదాబాద్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడుకోవాలని ఎంపీడీఓ దేవన్న సూచించారు. శనివారం మండల పరిధిలోని మహమ్మదాబాద్ గ్రామంలో నర్సరీల, ఈజీఎస్ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ఉపాధికూలీలకు కల్పించిన పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది సూచించినంత పని చేస్తే కూలీలకు తగిన కూలి గిట్టుబాటవుతుందని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అందుకు ఈజీఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కలను ఎండ నుండి కాపాడటానికి ప్రతీ రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో నీటిని అందించాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోను మొక్కలు ఎండిపోకూడదన్నారు. ఏపీఓ హర్షింద్రుడు ఉన్నారు.

రైతులను నట్టేటా ముంచారు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: రైతులు కన్నీరు కారుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతు దీక్షలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ చర్యలతో రైతాంగం రోడ్లపైకి వచ్చే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధుకు కేటాయించిన నిధులను సైతం ప్రస్తుతం అందించడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. నాలుగు నెలలు గడిచినా పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేదన్నారు. రైతులకు ఎకరాకు రూ. 15 వేలు, రైతు రుణమాఫీ రూ. 2 లక్షలు, పండించిన ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాన్ని విమర్శించడం తప్ప ప్రజల గురించి పట్టింపే లేదన్నారు. పదేళ్ల కాలంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం, చెరువులు, కుంటలను మరమ్మతు చేసుకోవడం, చెక్ డ్యామ్‌లను నిర్మించి రైతులకు సాగునీరు అందించామన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసిన నీటి గోస కనిపిస్తున్నదని ఆరోపించారు. నియోజకవర్గానికి రూ. 20 కోట్లు సీఎం నిధి నుంచి తెస్తే వాటిని క్యాన్సిల్ చేసే విధంగా కాంగ్రెస్ వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కరెంట్ పరిస్థితి కూడ అధ్వాన్నంగా మారిందన్నారు. ఎంపీపీలు గుంత మౌనిక, జెడ్పీటీసీ అన్నపూర్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, రాము, వివిధ మండలాల నాయకులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, బస్వరాజు, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాందాసు, భాస్కర్‌రెడ్డి, శివానంద్, కేబీఆర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొండారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి ఇంకా పలువురు పాల్గొన్నారు.

వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం



సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి యశోదమ్మ

గండేడ్: గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అందుకనుగుణంగా.. వారికి అవగాహన కల్పించాలని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం గండేడ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశవర్కర్ల సమావేశం నిర్వహించారు. పలు సూచనలు అందించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో ఉదయం 11 గంటల లోపు పనులన్నీ ముగించుకొవాలన్నారు. సాయంత్రం వరకు ఇళ్లల్లో నుంచి బయటికి వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంచాలని సూచించారు. ఉపాధి కూలీలకు నీడ కల్పించాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వాంతులు విరేచనాలు అయిన వెంటనే సమీప సబ్‌సెంటర్లలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. చల్లదనం పేరుతో శీతల పానీయాలు తాగి అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరి నీళ్లు తప్ప ఇతరత్రా ఏవీ వాడడం మంచిది కాదన్నారు. అంబదాస్, శాంతమ్మ, అలివేలు, పీహెచ్‌ఎన్ లూయిస్ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: వేపూర్‌లో శనివారం వడదెబ్బపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామప్రత్యేకాధికారి యశోదమ్మ ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

గండేడ్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏవీ రాములు, గండేడ్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొంరెడ్డిపల్లిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు భీమయ్య, నిర్వాహకులు ఆంజనేయులు, మోహన్, అంజి, ఏ.రాములు, విజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిన్నచింతకుంట: అమ్మపూరం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం దమగ్నాపూరం గ్రామంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో రంజిత్, మధువీర్, సాగర్‌రెడ్డి, రాజు, బుచ్చన్న, గంగాధర్‌రావు, ఫాతిమా బేగం, శ్రీదేవి, నారాయణమ్మతో పాటు పలువురు ఉన్నారు.

కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నట్లు శనివారం జిల్లా అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా చౌదర్‌పల్లి హన్మంతరెడ్డి, అధ్యక్షుడిగా దేవరకద్ర ఆది హన్మంతరెడ్డి, ఉపాధ్యక్షులుగా గౌని రాంపాండు, కొత్తకాపు నారాయణరెడ్డి, గోపి రామస్వామి, ఎస్. పురుషోత్తంరెడ్డి, జంగన్న, శ్రీనివాస సాగర్, సయ్యద్ ఇనాయత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా కుర్వ కొండాపురం జవహర్, బాల్‌రాజు, కోశాధికారిగా గొల్ల శ్రీనివాసులు, కార్యదర్శులుగా శ్రీనివాసులు, వెంకట్రాములు, రామన్‌గౌడ్, ఆంజనేయులు, ధన్వాడ శ్రీను, ఎర్రోళ్ల చంద్రయ్య, సభ్యులుగా నర్సింహులు, వడ్డె రాములు, గోపి శంకర్, ఖాదర్, దాసరి ఆశన్న ఉన్నట్లు వివరించారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: కిష్టారం గ్రామానికి చెందిన ఓ యువతి(18) శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కలా.. బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామానికి చెందిన ఓ యువకుడు కిడ్నాప్ చేసి ఉంటాడని తమకు అనుమానం ఉందని ఆమె తల్లి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

భార్యతో గొడవ పడి భర్త ...

జడ్చర్ల: భార్యతో గొడవ పడిన భర్త ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు..స్థానిక పాతబజార్‌కు చెందిన బాలరాజు, నందిని దంపతులు. కాగా ఈనెల 2న గొడవ పడ్డారు. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలరాజు తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శనివారం అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీఓలు, ఏపీఓలకు శిక్షణ

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. మొదటిరోజున 317మంది శిక్షణకు హాజరయ్యారు. పోలింగ్‌కు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రి సేకరణ, ఈవీఎంల పనితీరు, వాటిని సీల్ చేయటం వంటి వాటిపై పూర్తి అవగాహన కల్పించారు. శిక్షణకు 14మంది గైర్హాజరు కాగా వారిని ఆదివారం జరిగే శిక్షణకు హాజరు కావాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు సూచించారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



చౌదూర్‌లో టిఫిన్ బాక్స్ బైఠక్‌లో పాల్గొన్న నాయకులు

మిడ్జిల్: బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో వేణుగోపాల్ రెడ్డి వ్యవసాయ పొలం వద్ద బీజేపీ నాయకులు టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ ముచ్చర్లపల్లి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి బీజేపీ సంక్షేమ పథకాలను వివరించి.. అభ్యర్థి డీకే అరుణను గెలిపించుకోవాలన్నారు. రాజేష్, తిరుపతి, నరేందర్, భాస్కర్, రవిందర్‌గౌడ్, పాల్గొన్నారు.

నవాబుపేట: తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు జిల్లా నాయకులు యాదయ్య, శ్రీను తెలిపారు. శనివారం మండల కేంద్రంతో పాటు, లోకిరేవులో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నాయకులు లక్ష్మీనారాయణ, రాజు, చంద్రయ్య, శ్రీనివాస్, రాజేష్, ఆంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని బీజేపీ జిల్లా నాయకురాలు బాలత్రీపురసుందరి అన్నారు. శనివారం టిఫిన్ బాక్స్ బైఠక్ కార్యక్రమంలో చౌదూర్, లోకిరేవు గ్రామాల్లో పాల్గొని ప్రసంగించారు.

జడ్చర్ల: పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితిరెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు చేపట్టారు. మల్లేష్, కృష్ణ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: పెద్దర్పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్, శ్రీనుసాగర్, వినీత్‌గౌడ్, సుమన్‌గౌడ్, మేకల చంద్రయ్య, విష్ణుచారి, మహేష్, రవి గౌడ్, శ్రీకాంత్, అనంతయ్య, సాయిలు, మహిళలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులపై వేధింపులు తగవు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాలేజీ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులపై వార్డెన్ల వేధింపులు తగవని.. విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కోశాధికారి చంద్రకాంత్, నాయకులు రాజ్‌కుమార్, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అలివేలు, శివలీల, గీత, లత తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా నూతన కార్యవర్గం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో, ఎన్నికల అధికారిగా అడ్వకేట్ లక్ష్మీకాంతరావు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, జనరల్ సెక్రటరీగా రాఘవేందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంచందర్‌జీని, గౌరవ సలహాదారుగా బెక్కం జనార్దన్‌ను ఎన్నుకున్నారు.

‘జనజాతర’కు తరలిన కాంగ్రెస్ నాయకులు



సమావేశానికి వెళ్తున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆయా మండల కేంద్రాలు, గ్రామాల నుంచి శనివారం తుక్కుగూడ జన జాతర సభకు కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

- గండేడ్ మండలం నుంచి అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ర్యాగరి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
- మహమ్మదాబాద్ నుంచి అధ్యక్షుడు కేఎం నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్‌రెడ్డి, రాంలాల్, గిరిధర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణు,లక్ష్మణ్, రహీం తదితరులు పాల్గొన్నారు.
- రాజాపూర్ నుంచి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.
- నవాబుపేట నుంచి అధ్యక్షుడు రాంచంద్రయ్య, నాయకులు బంగ్లారవి, వెంకటేష్, భూపాల్‌రెడ్డి, వాసుయాదవ్, అజహర్, ఖాజా, వెంకటయ్య, నర్సింహులు, శర్మ, హమీద్, రాజు, అంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- మిడ్జిల్ నుంచి 25 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి కార్యకర్తలను తరలించినట్లు నాయకులు తెలిపారు.
- భూత్పూర్ నుంచి సభకు పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, మట్టి ఆనంద్, బోరింగ్ నర్సింహులు, మల్లికార్జున్, యాదయ్య, కిషన్ నాయక్ తదితరులు శనివారం వెళ్లారు.
- దేవరకద్రతో గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలారు.

రైతు వ్యతిరేకులకు బుద్ధిచెప్పాలి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి ప్రభుత్వ వ్యతిరేకతను చాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రైతుదీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. అదేవిధంగా రైతుబంధు ఎకరానికి రూ.15వేలు సహాయమందిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కరువును తీసుకువచ్చిందన్నారు. పంటలు ఎండి రైతులు నష్టపోయారని ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.25వేలు పంట నష్ట సహాయం అందించాలని డిమాండ్ చేశారు.జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, రామ్మోహన్, పాండు, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమతుల్లేని బడులపై చర్యలు తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటు పాఠశాలలపై వెంటనే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సతీష్ పేర్కొన్నారు. ఈమేరకు ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శివ, గణేష్, వంశీ, బలరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

అడిగేదివారే.. చెప్పేది వారే!

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మండల సభలో పాల్గొన్న అధికారులు

నవాబుపేట: వేదికపై నుంచి సమస్యలపై ఆరా తీసేది వారే.. సభలో సమస్యలు లేవనెత్తి ప్రశ్నించేది వారే.. ఇంకే ముంది శనివారం మొక్కుబడిగా సర్వసభ్య సమావేశాన్ని కానిచ్చేశారు అధికారులు. ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన జరిగిన సభను మమ అనిపించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచనలు, ఉపాధి కూలీల సౌకర్యాలు కల్పించాలని సలహాలతో సభ సాగిపోయింది. కేవలం గంటన్నరలో సమావేశాన్ని ముగించేశారు. సభలో కేవలం 11 మంది మాత్రమే ప్రజాప్రతినిధులు ఉండగా.. మిగతావారంతా అధికారులే కావడం గమనార్హం. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, కోఆప్షన్ తాహేర్, మండల స్పెషల్ అధికారి పద్మ, ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి, ఏఈలు కృష్ణకిషోర్, సమీయుల్లా, ఏపీఓ జ్యోతీ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా గౌరీపూజ



పాతగంజ్‌లోని ఓ షాపు వద్ద బొమ్మలతో రాజస్థానీ మహిళా మండలి సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గౌరీపూజ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాం మందిర్‌చౌరస్తా నుంచి పాన్‌చౌరస్తా, క్లాక్‌టవర్ మీదుగా రాజస్థానీ సమాజ్ భవన్ వరకు మహిళలు ఊరేగింపు తీశారు. ఈ సందర్భంగా వారందరూ ఏకరూప దుస్తులు ధరించి బొమ్మలు పట్టుకుని ముందుకు కదిలారు. అనంతరం రాజస్థానీ సమాజ్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజస్థానీ మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్‌గుప్తా, ఉపాధ్యక్షురాలు సృజాధూత్, కార్యదర్శి సునీతారాఠీ, సభ్యులు జమున, హార్తీకుట్‌తాపిర్యా, మంజురాఠీ తదితరులు పాల్గొన్నారు.